

ఆరు నెలల్లో వంద పడకల ఆస్పత్రి

ప్రజాశక్తి - నరసన్నపేట

నరసన్నపేట ఏరియా ఆస్పత్రిని ఆరు నెలల్లో వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నిర్వహించిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ తొలి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వాస్పత్రుల్లో ఎంతో పేరుగాంచిన నరసన్నపేట హాస్పిటల్ ప్రభ నేడు తగ్గిందన్నారు. పూర్వ వైభవాన్ని తీసుకొచ్చే బాధ్యత వైద్యులపైనే ఉందన్నారు. వైద్యులందరూ చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులతో పాటు వైద్యాధికారులు పాల్గొన్నారు.

రాజకీయ కారణాలతో పింఛన్ల తొలగింపు

- కలెక్టర్‌కు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఫిర్యాదు
- 'మీకోసం'కు 70 వినతులు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాజకీయ కక్షసాధింపులో బాగంగా టెక్కలి నియోజకవర్గంలో మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలతో వైసిపి సానుభూతిపరులైన వృద్ధులు, వితంతువులు, వికలాంగుల పింఛన్లను తొలగిస్తున్నారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. జిల్లాపరిషత్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం)లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఇతర అధికారులు కలిసి స్వీకరించిన వినతుల కార్యక్రమంలో ఆయన వినతిపత్రం అందించారు. పెన్షన్ రూ.4వేలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ఉన్న వాటిని తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రద్దు చేసిన పింఛన్లు వెంటనే పునరుద్ధరించకపోతే పోరాడతామన్నారు. హుదూద్ ఇళ్ల పంపిణీ గతంలో పూర్తయినా లబ్ధిదారులను ఖాళీ చేయించి టిడిపి కార్యకర్తలకు తిరిగి వాటిని ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇటువంటి నిర్ణయాల వల్ల అర్హులైన పేదలకు అన్యాయం జరుగుతోందని, లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. మరణ ధ్రువీకరణ పత్రం కోసం సచివాలయంలో దరఖాస్తు చేసి ఆరు నెలలు గడుస్తున్నా, ఇంతవరకు ఇవ్వడం లేదని టెక్కలి మండలం పెద్దసానకు చెందిన డి.అప్పలరాజు ఫిర్యాదు చేశాడు. తుపాను ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, పోలాకి మండలాల్లో వరి చేలు తడిచి ముద్దయ్యాయని, తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని పోలాకి మండలం సుసరాంతో పాటు ఆయా మండలాల రైతులు వినతిపత్రాలు అందజేశారు. వీటితో పాటు పలురకాల సమస్యలపై 70 వినతులు వచ్చాయి. వినతుల స్వీకరణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, జెడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.వి శ్రీధర్ రాజా వినతులను స్వీకరించారు.

త్వరలో కొత్త కలెక్టరేట్ నుంచి పాలన

నూతనంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. వినతుల స్వీకరణ అనంతరం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే పలు విభాగాలు సిద్ధమయ్యాయని, వాటిని శాఖల వారీగా కేటాయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు అన్ని శాఖలు ఒకే చోట అందుబాటులో ఉండే విదంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులకు ప్రత్యేక ఛాంబర్లను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో 110 విభాగాలు ఉన్నాయని, వాటిలో 79 శాఖలకు మాత్రమే ఇక్కడ చోటు కల్పించేందుకు వీలుందని ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్ సుధాకర్ కలెక్టర్‌కు వివరించారు.

జిల్లాస్థాయిలో కోర్ కమిటీ ఏర్పాటు

జిల్లాస్థాయిలో పది మంది ఉన్నతాధికారులతో కోర్ కమిటీని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కమిటీలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఒ, డిఆర్‌డిఎ పీడీ, జెడ్‌పి సిఇఒ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇలు, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి, జిల్లా విద్యాశాఖాధికారి ఉంటారని తెలిపారు.

జిఒ 36 అమలు చేయాలి

నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఇంజినీరింగ్ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు జిఒ నంబరు 36 ప్రకారం జీతాలు చెల్లించాలని సిఐటియు నాయకులు ఎం.గోవర్ధనరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, ఇంజినీరింగ్ విభాగం జిల్లా అధ్యక్షులు రాణా శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ కార్పొరేషన్ కార్యాలయం వద్ద కార్మికులు సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు వర్కర్స్ రెగ్యులేషన్ అండ్ అబాలిషన్ యాక్టు -1970 ప్రకారం శాశ్వత స్వభావం కలిగి ప్రమాదకరమైన విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదకరమైన పనులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్ చెల్లించాలన్నారు. మరమ్మతు పనులకు అవసరమైన పనిముట్లు, కిట్లు, సకాలంలో అందించాలన్నారు. సామాన్లు తీసుకెళ్లే వాహనాలు మరమ్మతుకు గురైతే ఆ భారాన్ని కార్మికులపై నెట్టేస్తున్నారని, దీనివల్ల అరకొర వేతనాలతో పనిచేస్తున్న కార్మికులు అదనపు ఆర్థిక భారాన్ని మోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ వాహనాలను మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు చట్టబద్ధమైన వారాంతపు, క్యాజువల్, జాతీయ సెలవులు అమలు చేయాలన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఇస్తున్న విధంగా రెండు జతల యూనిఫామ్, కుట్టు ఛార్జీ, చెప్పులు, సబ్బులు, నూనెలు, టవల్స్ ఏటా ఇవ్వాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు అదనపు పనులు కేటాయించినప్పుడు తప్పనిసరిగా టిఎ, డిఎలు చెల్లించాలన్నారు. సిటీ బస్ సర్వీసులు ఉన్న ప్రతి పట్టణంలో పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. గత సమ్మె కాల ఒప్పందాల్లో భాగమైన రిటైర్మెంట్ బెనిఫిట్స్ పదేళ్ల సర్వీసు ఉన్న వారికి రూ.75 వేలు, పదేళ్ల పైబడి సర్వీసు ఉన్న వారికి ఏడాదికి రూ.రెండు వేలు అదనంగా ఇవ్వాలన్నారు. ప్రమాద మృతులకు రూ.ఐదు లక్షల నుంచి రూ.ఏడు లక్షల ఎక్స్‌గ్రేషియో పెంచాలని, మృతి చెందిన వారికి దహన సంస్కారాలకు రూ.15 వేలు నుంచి రూ.20వేలు ఆర్థిక సహాయం పెంచేందుకు జిఒ జారీ చేయాలన్నారు. కాజీపేట పంపు హౌస్ శ్లాబ్ తొలగించి నూతనంగా నిర్మించాలని కోరారు. ఈలోగా అక్కడ కార్మికులకు ప్రమాదం సంభవిస్తే ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. పార్కుల్లో పనిచేస్తున్న మహిళలకు మరుగుదొడ్లు సదుపాయం కల్పించాలని కోరారు. పండగ కానుక రూ.వెయ్యి చెల్లించాలన్నారు. రిటైర్మెంట్, చనిపోయిన, అనారోగ్య కారణంగా కార్మికులకు పెన్షన్, గ్రాట్యుటీ, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. మహిళా కార్మికులపై వేధింపులు ఆపాలన్నారు. తక్షణమే ఈ సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం అధ్యక్షులు పి.త్రినాథరావు, పి.మణికంఠ, ఆర్.గిరిజాశంకర్, బి.వెంకటరమణ, కె.ఎల్లయ్యరెడ్డి, పి.శ్రీకాంత్, ఆర్.రమేష్‌బాబు, పి.సోమేష్, పి.శాంతి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

'గుండ'కు ఇచ్చే గౌరవం ఇదేనా..?

- బ్రెయిన్ శస్త్రచికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న మాజీ మంత్రి అప్పలసూర్యనారాయణ
- పరామర్శించడానికి ఇష్టపడని అచ్చెన్న, శంకర్
- కనీసం ఫోన్‌లోనూ పరామర్శించని చంద్రబాబు



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

గుండ అప్పలసూర్యనారాయణ... జిల్లా ప్రజలకు పరిచయం అవసరం లేని రాజకీయ నేత. మాజీ మంత్రి, టిడిపిలో అత్యంత సీనియర్ నాయకుడు. మంచి రాజకీయ అనుభం ఉన్న నేత. నీతి, నిజాయతీ ఉన్న వ్యక్తిగా రాష్ట్రవ్యాప్తంగా ఆయనకు మంచి పేరుంది. కేబినెట్ మినిస్టర్‌గా, ఎమ్మెల్యేగా జిల్లాకు, నియోజకవర్గానికి ఆయన అందించిన సేవలను ఇప్పటికీ ప్రజలు చెప్పుకుంటారు. పార్టీకి కష్టకాలంలో ఎవరూ ముందుకు రాని సమయంలో 1989-94 వరకు అధ్యక్ష బాధ్యతలనూ నిర్వర్తించారు. పార్టీ మాత్రం ఆయన్ను పూర్తిగా విస్మరించిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బ్రెయిన్‌లో రక్తం గడ్డ కట్టి తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనకు సెప్టెంబరులో విశాఖపట్నం అపోలో ఆస్పత్రిలో వైద్యులు శస్త్రచికిత్స చేశారు. సుమారు 40 రోజులు ఆస్పత్రిలో ఉన్న ఆయన చికిత్స అనంతరం ఇటీవల అరసవల్లిలోని ఆయన నివాసానికి చేరుకున్నారు.

మాజీ మంత్రి అప్పలసూర్యనారాయణ రాజకీయ జీవితం టిడిపితోనే ప్రారంభమైంది. శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి 1983లో తొలిసారి టిడిపి నుంచి ఎన్నికైన ఘనత సాధించారు. నాటి నుంచి శ్రీకాకుళం నియోజకవర్గం టిడిపికి కంచుకోటగా మారింది. సుమారు 20 ఏళ్ల అప్రతిహతంగా రాజకీయ జీవితం కొనసాగింది. కరువు, దేవాదాయశాఖ మంత్రిగా పనిచేసి మంచి సేవలందించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి వేలం పాటలో ఆయన వెనుకబడ్డారు. ఫలితంగా ఆయన కుటుంబానికి దక్కాల్సిన శ్రీకాకుళం అసెంబ్లీ సీటు ప్రస్తుత ఎమ్మెల్యే గొండు శంకర్‌కు పార్టీ కట్టబెట్టింది. పార్టీ కార్యకర్తలు ఆగ్రహోదగ్రులై ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని అప్పలసూర్యనారాయణపై ఒత్తిడి చేసినా పార్టీ నిర్ణయానికే కట్టుబడి పోటీకి దూరంగా ఉన్నారు. వైసిపి నుంచి ఎంపీ టిక్కెట్ ఆఫర్ వచ్చినా ఆయన సున్నితంగా తిరస్కరించారు.

పరామర్శకు ఇష్టపడని అచ్చెన్న, శంకర్

శ్రీకాకుళం నియోజకవర్గాన్ని టిడిపికి కంచుకోటగా మార్చి పార్టీకి అపారమైన సేవలందించిన గుండ అప్పలసూర్యనారాయణకు ప్రస్తుతం పరామర్శించే వారే కరువయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు ఫోన్‌లోనైనా కనీసం యోగక్షేమాలు అడిగేందుకు తీరిక లేకపోయింది. దీనిపై గుండ కుటుంబ అభిమానులు, కార్యకర్తల్లో తీవ్ర ఆవేదన నెలకొంది. జిల్లాకు చెందిన పార్టీ పెద్దలూ పరామర్శించకపోవడం గుండ అభిమానులను కలచివేస్తోంది. ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు జిల్లా కేంద్రానికి వస్తున్న వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు అరసవల్లి వెళ్లేందుకు తీరిక లేకపోయింది. కనీసం ఫోన్‌లోనూ పరామర్శించలేదని తెలుస్తోంది. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ కూడా అటువైపు చూడకపోవడం గుండ అభిమానులు, కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. గొండు శంకర్ తండ్రి జగన్నాథరావును ఎంపిపి చేయడంతో పాటు నియోజకవర్గంలో ఒక గుర్తింపు తీసుకొచ్చిందని అప్పలసూర్యనారాయణ అని, కనీసం కృతజ్ఞత లేకపోవడమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. సామాన్య కార్యకర్తలను పరామర్శించేందుకు వెళ్లేందుకు సమయం కేటాయించే మంత్రి అచ్చెన్న, ఎమ్మెల్యే శంకర్‌కు ఆయన బాగోగులను అడిగేందుకు తీరిక లేదా అని చర్చించుకుంటున్నారు. చివరకు చిరకాల రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్న ధర్మాన సోదరులు సైతం స్వయంగా ఆస్పత్రికి వెళ్లి పరామర్శించినట్లు తెలిసింది. అప్పలసూర్యనారాయణ వంటి నేతనే విస్మరిస్తే, తమ పరిస్థితి ఏమిటని ద్వితీయ శ్రేణి నాయకులు, పలువురు కార్యకర్తలు అంటున్నారు.

అధైర్యపడొద్దు... అండగా ఉంటాం

సౌదీలో చిక్కుకున్న జిల్లా వలస కార్మికులకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు భరోసా



వలస కార్మికులతో ఫోన్‌లో మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పొట్ట కూటి కోసం విదేశాలకు వెళ్లి, అక్కడ చిక్కుకున్న వలస కార్మికులకు అండగా ఉంటామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు భరోసా కల్పించారు. బాధితులందరినీ స్వదేశానికి తీసుకొచ్చేలా కేంద్ర విదేశాంగ శాఖపై ఒత్తిడి తీసుకొస్తానని హామీనిచ్చారు. జిల్లాలోని ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట, వజ్రపుకొత్తూరు, నందిగాం, ఒడిశాలోని గంజాం జిల్లాకు చెందిన 30 మంది వలస కార్మికులు సౌదీ వెళ్లి చిక్కుకున్న విషయం తెలిసిందే. రెండు నెలలు పనిచేసినా సంబంధిత యాజమాన్యం జీతాలు చెల్లించకపోవడం, నాలుగు రోజులుగా తిండి కూడా లేకపోవడంతో వారంతా అల్లాడిపోయారు. బాధిత కుటుంబాల ద్వారా సమస్యను తెలుసుకున్న ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్.. ఢిల్లీలో పార్లమెంటు సమావేశాల్లో ఉన్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన... బాధిత కార్మికులతో సోమవారం ఫోన్‌లో వీడియో కాల్ ద్వారా మాట్లాడారు. అందరినీ సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చేలా కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌ను కలిసి ఒప్పిస్తానన్నారు. భారత ఎంబసీ కార్యాలయానికి సమస్యను చేరవేసి.. ఆహారం, ఇతర ఏర్పాట్లు చేస్తానని చెప్పారు.

న్యాయ చట్టాల్లో మార్పులు అనివార్యం

డిఎస్ఎన్ఎల్‌యు వైస్ ఛాన్సలర్ డి.సూర్యప్రకాశరావు



మాట్లాడుతున్న డిఎస్ఎన్ఎల్‌యు వైస్ ఛాన్సలర్ సూర్యప్రకాశరావు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

రాజ్యాంగంలో చేస్తున్న సవరణల్లానే సమాజ శ్రేయస్సు, దేశ భద్రత కోసం న్యాయ చట్టాల్లోనూ మార్పులు అనివార్యమయ్యాయని దామోదర సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (డిఎస్ఎన్ఎల్‌యు విశాఖ) వైస్ ఛాన్సలర్ ఆచార్య డి.సూర్యప్రకాశరావు అభిప్రాయపడ్డారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం రీసెర్చ్ ఫోరం సోమవారం నిర్వహించిన సమావేశంలో 'క్రిమినల్ జస్టిస్ లా అండ్ రీసెంట్ ట్రెండ్స్' అనే అంశంపై కీలకోపన్యాసం చేశారు. బ్రిటిష్ కాలం నాటి పలు చట్టాల్లో స్వల్ప మార్పులు చేసి, ప్రస్తుత ప్రజలకు సరైన న్యాయం అందేలా నూతన చట్టాలకు పార్లమెంట్ ఇటీవల ఆమోదం తెలిపిందన్నారు. ఐపిసి 1860, సిసిపి-1973, ఇండియన్ ఎవిడెన్స్ యాక్టు 1872కు బదులు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష, భారతీయ సాక్ష్యా అధిన్యం వంటివి ప్రస్తుతం అమల్లోకి వచ్చాయన్నారు. అంతర్జాతీయ ఉగ్రవాదం, దేశ సరిహద్దు సమస్యలు అధికమవడంతో ఐపిసిని మరింత మెరుగ్గా సవరణలు చేశారని చెప్పారు. చిన్న దొంగతనాల్లో శిక్షకు గురైన వారిని జైళ్లకు తరలించకుండా సామాజిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా న్యాయస్థానాలు సూచిస్తుండడం ఎంతో ఆశాజనకమైన ప్రక్రియ అని అన్నారు. సమధర్మం - సమ న్యాయం వైపే మొగ్గు చూపడం వల్ల అనేక సందేహాలు, సంక్షోభాలకు పరిష్కారం చూపినట్లయిందని తెలిపారు. ఆర్టికల్- 20, 21, 22తో పాటు 41(ఎ) ప్రాధాన్యత గురించి ఈ సందర్భంగా వివరించారు.

బిఆర్ఎయు వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్ రజని మాట్లాడుతూ బ్రిటిష్ పరిపాలనా కాలం నుంచి అమలవుతున్న పలు భారతీయ చట్టాలు సామాజిక శాస్త్రాలు, సైన్స్ అంశాలతో మిళితమైనవేని చెప్పారు. న్యాయ విద్యను అభ్యసిస్తున్న వారు నూతన చట్టాలపై సరైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వర్శిటీ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, న్యాయ విద్యా విభాగం సమన్వయకర్త వై.రాజేంద్రప్రసాద్, పి.రవికుమార్ తదితరులు మాట్లాడారు.

గంజాయి వ్యాపారుల ఆస్తుల జప్తు

విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి

ప్రజాశక్తి - విశాఖపట్నం

విశాఖపట్నం రేంజ్ పరిధిలోని గంజాయి వ్యాపారుల ఆస్తులను గుర్తించి జప్తు చేస్తామని డిఐజి గోపీనాథ్ జట్టి తెలిపారు. ఇంతవరకు ఆస్తుల గుర్తింపులో సాధించిన పురోగతిపై శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన ఎస్‌పిలు, డిఎస్‌పిలు, సిఐలతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు నమోదైన గంజాయి కేసుల్లో అరెస్టయిన నిందితులు, వారు గంజాయి వ్యాపారంతో కూడబెట్టిన ఆస్తులను గుర్తించాలన్నారు. నిందితుల పేరున గుర్తించిన ఆస్తులను జప్తు చేసేందుకు చేపట్టాల్సిన విధి విధానాలు, నిబంధనలను అధికారులకు వివరించారు. ఆస్తుల జప్తునకు చట్టపరమైన చిక్కులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి కట్టడికి పటిష్ట చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కఠిన చర్యల్లో భాగంగా గంజాయి అక్రమ రవాణకు పాల్పడుతూ పట్టుబడిన నిందితుల ఆస్తులను జప్తు చేయాలని నిర్ణయించిందని చెప్పారు. రేంజ్ పరిధిలో ఇప్పటివరకు నమోదైన కేసుల్లో ఆస్తుల గుర్తింపులో సాధించిన పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఎస్‌పిలు కె.వి మహేశ్వర రెడ్డి, వకుల్ జిందల్, ఎస్.వి మాధవ్ రెడ్డి, అమిత్ బర్దార్, తుహిన్ సిన్హా, డిఎస్‌పిలు, సిఐలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి చెస్ టోర్నీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

క్రమం తప్పకుండా చదరంగం క్రీడను ప్రాక్టీస్ చేస్తూ నైపుణ్యం గల క్రీడాకారులుగా ఎదగాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎసిబి సిఐ కె.భాస్కర్ అన్నారు. నగరంలోని తిలక్‌నగర్ కాలనీలోని స్కూల్ ఆఫ్ చెస్ ఆకాడమీ ఆధ్వర్యాన జిల్లాస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌ను సోమవారం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లోని చెస్ క్రీడాకారులు ఐదు రౌండ్ల పాటు నిర్వహించిన చెస్ పోటీల్లో ఆసక్తిగా పాల్గొన్నారు. తంగి సూర్య ఐదు విజయాలతో విజేతగా నిలవగా, రెండో స్థానంలో బలివాడ జయంత్, మూడో స్థానంలో ఎం.కళ్యాణ్ చక్రవర్తి నిలిచారు. అండర్-10 బాలబాలికల్లో కె.పార్థని, బి.పన్నిత, ఎస్.దివ్యేష్, కె.రోహన్ విజేతలుగా నిలిచారు. విజేతలకు ఎసిబి సిఐ భాస్కర్ మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు, బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫెడే రేటింగ్స్ చెస్ క్రీడాకారులు, స్కూల్ ఆఫ్ చెస్ ఆకాడమీ చెస్ కోచ్‌లు భేరి చిన్నారావు, కె.సాయి నిరంజన్‌సింగ్, చెస్ అభిమానులు పాల్గొన్నారు.

బైక్‌ల చోరీ నిందితుడు అరెస్టు

- 15 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- డిఎస్‌పి వి.వెంకట అప్పారావు



మాట్లాడుతున్న డిఎస్‌పి వెంకట అప్పారావు

ప్రజాశక్తి - పలాస

ద్విచక్ర వాహనాల దొంగతనానికి పాల్పడిన ఒడిశా రాష్ట్రం రాయఘడ బ్లాక్ మండలబుయాన్‌కు చెందిన అమీర్ బుయాన్‌ను అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు తెలిపారు. నిందితుడి నుంచి 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడిని ప్రవేశపెట్టి, కేసు వివరాలను వెల్లడించారు. ఇటీవల కాలంలో కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో పలు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయని, వాటిలో కాశీబుగ్గ, సొంపేట పరిధిలో ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో ఎస్‌పి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు స్పెషల్ క్రైమ్ పార్టీని ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా తమకు అందిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి మండలంలోని మొగిలిపాడు వద్ద బైక్‌పై వస్తున్న అమీర్ బుయాన్‌ను తనిఖీ చేసి విచారణ చేపట్టగా, నేరం అంగీకరించాడని చెప్పారు. నిందితుడి నుంచి పలాస పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎనిమిది, మందసలో రెండు, టెక్కలిలో ఒకటి, శ్రీకాకుళం టూ టౌన్ పరిధిలో నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నిందితుడి స్నేహితులు కొంతమంది పలు నేరాలకు పాల్పడ్డారన్న సమాచారం ఉందని, దానిపైనా దర్యాప్తు చేపడతామన్నారు. నిందితుడిని పట్టుకోవడంలో కృషి చేసిన సబ్ డివిజన్ క్రైమ్ పార్టీ కానిస్టేబుళ్లు గవరయ్య, ప్రసాద్, నీలకంఠం, షణ్ముఖరావును అభినందించారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లోనూ ట్రాఫిక్ నియంత్రణపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉద్దానం మార్కెట్, ఆటో స్టాండ్ కూడా మార్చేందుకు ప్రతిపాదనలు చేస్తున్నామని చెప్పారు. కోటి రోడ్డులో ఫుట్‌పాత్ అనుకొని పెట్టిన దుకాణాలనూ మార్చేందుకు ప్రతిపాదన చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో కాశీబుగ్గ సిఐ డి.మోహనరావు పాల్గొన్నారు.

విప్ కారు ఢీకొని వృద్ధుడు మృతి



వివరాలను సేకరిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ కారు ఢీకొని మండలంలోని కొఠారి గ్రామానికి చెందిన పాలెపు అంగధరావు (77) సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని కొఠారిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాడి సహదేవరెడ్డి సోదరుడు జోగారావు కుమార్తె నిశ్చితార్థం కార్యక్రమానికి విప్ హాజరయ్యారు. తిరిగి ఆయన నివాసానికి వెళ్తుండగా కొఠారి గ్రామ బస్సు షెల్టర్ వద్దకు వచ్చేసరికి అదే గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని, సరిగా కళ్లు కనిపించని అగంధరావు ఎమ్మెల్యే కారుకు ఎదురుగా రావడంతో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఆయన్ను విప్ తన సొంత వాహనంలో ఇచ్ఛాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో అగంధరావు మృతి చెందాడు. అనాథ అయిన ఆయన కొఠారి బస్టాండ్ వద్ద ఉంటాడని స్థానికులు చెప్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

'వర్మీ' విక్రయాలను ప్రోత్సహించాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వర్మీ కంపోస్టు విక్రయాలను ప్రోత్సహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరం బయట దూసి పంచాయతీ నుంచి ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్టు స్టాల్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్మీ కంపోస్టు పంచాయతీల నుంచి స్వయం సహాయక సంఘాలకు సరఫరా చేస్తే వారు విక్రయిస్తారని చెప్పారు. పంచాయతీలకు క్యూఆర్ కోడ్ ఉండాలని, దాని ద్వారా వర్మీ కంపోస్టు పేమెంట్ తీసుకోవాలని డిపిఒ కె.భారతీ సౌజన్యను ఆదేశించారు. వర్మీ కంపోస్టు అందరూ కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలన్నారు.

మున్సిపాల్టీల నుంచి వర్మీ కంపోస్టు స్టాల్‌ను ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆర్గానిక్ పంటలు పండించే రైతుల ఫోన్ నంబర్లు తీసుకొని వారికి వర్మీ కంపోస్టు విక్రయంపై తెలియజేయాలని ఆదేశించారు. ఆర్గానిక్ పంటలు పండించే రైతుల ఫోన్ నంబర్లు మార్కెటింగ్ శాఖ ఎడి వద్ద ఉంటాయని చెప్పారు. వర్మీ కంపోస్టు రైతులకు ఉపయోగకరంగా ఉండాలన్నారు. ఉద్యానవన శాఖ, ఉపాధి హామీ నుంచి వర్మీ కంపోస్టు ఉపయోగాలపై రైతులకు తెలియజేయాలన్నారు. డిపిఒ భారతీ సౌజన్య మాట్లాడుతూ ప్రతి సోమవారం గ్రీవెన్స్ ప్రాంగణం వద్ద ఈ స్టాల్ ఉంటుందని తెలిపారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ఫిర్యాదులు పెండింగ్ ఉండరాదు

ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రజా ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించి పెండింగ్ లేకుండా చూడాలని, త్వరితగతిన చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో ప్రజల నుంచి 50 ఫిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకున్నారు. వచ్చిన అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సంబధిత అధికారులకు తెలియజేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలన్నారు.

రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

తుపానుకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కౌలు రైతు సంఘం నాయకులు బి.ఆనందరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని నగరంపల్లి, గల్లి గ్రామాల్లోని తడిచిన వరి పంటను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు రోజులుగా కురిసిన వర్షాలకు వరి పంట తడిసి ముద్దయ్యిందన్నారు. వేలాది ఎకరాల్లో కోత, కుప్పలు తడిసి అపార నష్టానికి రైతులు గురయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎకరానికి రూ.25 పెట్టుబడి పెట్టి పంట చేతికి అందిన సమయంలో పంటలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మొలకలు వచ్చిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి ప్రభుత్వ నిర్ణయించిన ధర ప్రకారం డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. అలాగే అపరాలకూ నష్టపరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో టి.భాస్కరరావు, బి.సుగుణవతి, డి.భాస్కరరావునాయుడు, టి.ధర్మారావు, ఎస్.సరోజనమ్మ, ఎన్.మోహనరావు, బి.రామకృష్ణ, ఎన్.సింహాచలం, ఆర్.మోహనరావు, ఎన్.చంద్రయ్య పాల్గొన్నారు.



తడిసిన పంటలను పరిశీలిస్తున్న కౌలు రైతుసంఘం నాయకులు


కూలీల పొట్ట కొడుతున్న యంత్రాలు

- కోతల సమయంలో దొరకని పనులు
- పశుగ్రాసానికి కొరత

ప్రజాశక్తి- బూర్జ

ఖరీఫ్ సీజన్‌లో రైతు కూలీలకు చేతినిండా పని దొరికేది. గ్రామీణ ప్రాంతంలోని వ్యవసాయ కూలీలు ఒక గ్రూపుగా ఏర్పడి వ్యవసాయ పనులను కోతలు, నూర్పులు, చేను పెరగడం వంటివి చేసుకునేవారు. దీంతో వారి జీవనం సాఫీగా సాగిపోతుండేది. అయితే ఆధునిక యంత్రాలు వ్యవసాయ కూలీల పొట్ట కొడుతున్నాయి. దీంతో ఖరీఫ్ సీజన్‌లో కూడా వ్యవసాయ కూలీలకు పనులు దొరకని పరిస్థితి నెలకొంది.

ఖరీఫ్ వరి కోతలు మొదలయ్యాయి. గత 20 రోజులుగా మండలంలో ముమ్మరంగా వరి కోతలు రైతులు ప్రారంభించారు. దీంతో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి హార్వెస్టింగ్ యంత్రాలు మండలానికి చేరుకున్నాయి. సహజ పద్ధతులకు భిన్నంగా హార్వెస్టింగ్ పెరగడంతో గ్రామీణ ప్రాంతాల్లోని కార్మికుల ఉపాధి కూచించుకు పోతుంది. అంతేకాక భవిష్యత్‌లో పశుగ్రాసానికి కొరత కూడా ఏర్పడే అవకాశం ఉందని పశుపోషకులు వాపోతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సుమారు 15 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి



రేపర్ యంత్రంతో కోస్తున్న వరిచేను

సాగవుతుంది. నాట్లు వేయడం, కలుపు తీయడం, ఎరువులు, వెదజల్లడం, కోతలు, కుప్పలు చేయడం, నూర్పులు తదితర పనులు చేయడం ద్వారా అత్యధిక మంది గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు ఎక్కువ రోజుల పాటు ఉపాధి దొరుకుతుండేది. కోత, కుప్పలు నూర్పులకు సంబంధించి ఎకరానికి 23 మంది కూలీలు చొప్పున అవసరమవుతారు.

ఈ పనులకు రైతులు రూ.15 వేలు మగతా పద్ధతిలో చెల్లిస్తారు. ఈ పనులు చేసేందుకు ఒక్కో వ్యవసాయ కూలికి రోజుకు రూ.300 నుంచి రూ.400 వరకు దక్కుతుండేది. కొన్ని వందల మంది వ్యవసాయ కూలీలకు ఈ సీజన్‌లో రెండు, మూడు నెలలకుపైగా పనులు దొరకడంతో పాటు ఆదాయం కూడా దొరుకుతుండేది.

హార్వెస్టింగ్ యంత్రాలపై ఆసక్తి

ప్రస్తుతం రైతులు హార్వెస్టింగ్ యంత్రాలపై ఆసక్తి చూపుతున్నారు. దీనికి ముఖ్య కారణం వ్యవసాయ పనుల్లో యంత్రాలను ఉపయోగించడం వలన అన్ని పనులు ఏకకాలంలో జరుగుతాయన్న ఉద్దేశంతో రైతులు యంత్రాలను వినియోగిస్తున్నారు. వరి కోతలు కోయడం, నూర్పులు, అనంతరం గాలిపట్టడం వంటి పనులన్ని చకచకా జరిగిపోవడంతో రైతులు యంత్రాలపై ఆసక్తి



హార్వెస్టింగ్ యంత్రాలతో చేపడుతున్న కోతలు

చూపిస్తున్నారు. ముఖ్యంగా అటు వ్యవసాయ కూలీలకు అయ్యే ఖర్చు కన్నా ఆధునిక యంత్రాల వినియోగం వల్ల అయ్యే ఖర్చు సమంగా వుండడం వలన వ్యవసాయ పనులకు యంత్రాలను ఉపయోగిస్తున్నారు.

తప్పని నష్టాలు

హార్వెస్టింగ్ యంత్రాలను వినియోగించడం వలన తక్కువ సమయంలోనే పనులన్నీ పూర్తయినప్పటికీ పలు సమస్యలు తలెత్తుతున్నాయని రైతులు తెలిపారు. ఈ యంత్రాలు వినియోగం వల్ల పశుగ్రాసం సమస్య తలెత్తుతుంది. దీనివలన పాడి రైతులకు పశుగ్రాసం సమస్య వేధిస్తుంది. పాడి పశువులకు పశుగ్రాసం దొరక్కపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

వ్యవసాయ పనులపై తాము జీవనం సాగిస్తున్నాం. అయితే యంత్రాలు వినియోగించడం ద్వారా తాము పస్తులు ఉండాల్సిన పరిస్థితి తలెత్తుతుందని వ్యవసాయ కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు పనులు దొరికేల చర్యలు చేపట్టాలని మండలంలోని కూలీలు కోరుతున్నారు.

పనుల్లేక పస్తులు

పనులు లేక పస్తులు ఉంటున్నాం. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ పనులు దొరకడం లేదు. రైతులందరూ ఆధునిక యంత్రాలను వినియోగిస్తున్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలి.

- శాసపు రాము, వై.పర్త


వలసలు తప్పడం లేదు

ఉన్న గ్రామంలో పనులు దొరకడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో పొట్ట చేత పట్టుకొని వలసలు పోవాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. కుటుంబ పోషణ కోసం దూర ప్రాంతాలకు వలసలు వెళ్లక తప్పడం లేదు.

- కొరికాన అప్పలనర్సమ్మ, కురింపేట

కష్టం... క'న్నీటి'పాలు

- నేలకొరిగిన వరిచేలు
- ఆందోళనలో రైతులు



కవిటి : పుటియాదలలో నేలకొరిగిన పంట

ప్రజాశక్తి- కవిటి

ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఆవిరైంది. తుపాను నేపథ్యంలో కురిసిన వర్షానికి పంట నేలకొరిగి నీటిపాలైంది. దీంతో ఆరు నెలలు పడిన కష్టం కళ్లముందే నేలమట్టమవడంపై రైతులు ఉసూరంటున్నారు. ఓవైపు సాగు ఖర్చులు భారీగా పెరిగిపోవడంతో పంటకు ఏమాత్రం నష్టం జరిగినా తమకు కోలుకోలేని దెబ్బ తగులుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పుటియాదల, కపాసుకుద్ది, కవిటి రెవెన్యూ డివిజన్ పరిధిలో నష్ట తీవ్రత కొంచెం ఎక్కువగా ఉంది. కుసుంపురం, మాణిక్యపురం బల్లిపుట్టుగ, నెలవంక తదితర ప్రాంతాల్లో పాక్షికంగా నష్టం వాటిల్లిందని వ్యవసాయ సిబ్బంది తెలిపారు.

కోటబొమ్మాళి: తుపాను కారణంగా మండలంలోని గంగరాం, లఖందిడ్డి, యలమంచిలి, హరిశ్చంద్రపురం, చీపుర్లపాడు, ఎత్తురాళ్లపాడు, నిమ్మాడ తదితర గ్రామాల్లో సుమారు 1500 ఎకరాల పైనే వరి పంట నీటిలో నానుతోంది, వర్షంనీరు ముందుకుపోయే పరిస్థితి లేకపోవడంతో వరిచేలు కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పలువురు రైతులు పొలాల్లో తడిచిన వరిచేనును రైతులు గట్టుపై వేసి ఆరబెడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ధాన్యం కొనుగోలులో తేమ శాతం, నిబంధనలు సడలించాలని, తడిచిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాలని కోరుతున్నారు.



కోటబొమ్మాళి : నేలకొరిగిన వరిచేను

మొత్తం నేలకొరిగింది



ఎకరా 25 సెంట్లలో వరి పంట వేశాను. పంట ఏపుగా పెరిగిం ది. మరో నాలుగైదు రోజుల్లో కోతకు సిద్ధమవుతున్న తరుణంలో వర్షం కొంప ముంచింది. మొత్తం పంట నేలమట్టమయింది. ఖర్చులు భారీగా పెరిగిపోవడంతో ఇప్పటికే సుమారు రూ.30, 40 వేల మధ్య ఖర్చయింది. ప్రస్తుతానికి పడిపోయిన చేని దిగువ నీరు ఉంది. గింజలు మొలకొస్తే భారీ నష్టం తప్పదు.

- పిరియా శ్రీనివాసరావు, కపాసుకుద్ది రైతు

90 శాతం నేలమట్టం



నాకున్న 80 సెంట్లు వరి సాగు చేశాను. పంట బాగా పండింది. సోమవారం నుంచి కోత కోద్దామని కూలీలకు కూడా చెప్పాను. ఈలోగా వర్షంతో 70 సెంట్లు పంట నేలమట్టమైంది. ఇటీవల కాలంలో ప్రకృతి విపత్తులకు అటు ఉద్యానవన పంటలు, ఇటు వ్యవసాయ పంటలు భారీగా నష్టపోతున్నాయి.

- మాదిన లక్ష్మణమూర్తి, పుటియాదల రైతు

ప్రభుత్వానికి నివేదిస్తాం



మండలంలోని అన్ని గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించా. సుమారు 70-80 ఎకరాల మధ్య పంట నేలకొరిగింది. అయితే అందులో సుమారు 50 ఎకరాలకు పైగా పంట కింద నీరు ఉంది. ఇప్పటికే వివరాలు ఉన్నతాధికారులు తెలియజేశాం. పూర్తి వివరాలతో ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం. ఎట్టి పరిస్థితుల్లో రైతులకు న్యాయం చేస్తాం. రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

- బడగల దుర్గా ప్రసాద్, ఎఒ

బాలిక ఆత్మహత్యాయత్నం

కొత్తూరు : మండలంలోని గొట్టిపల్లి గిరిజన గ్రామానికి చెందిన బాలిక ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాలికకు తల్లిదండ్రులు లేకపోవడంతో పెద్దబగ్గలో ఉంటున్న ఆమె పెద్దమ్మ వద్దకు వెళ్లి వస్తుండేది. ఈ నేపథ్యంలో పెద్దబగ్గకు చెందిన బెహరా జనార్ధనరావుతో పరిచయమైంది. అది కాస్త ప్రేమగా మారింది. తరగతులు వేరు కావడంతో జనార్ధనరావు కుటుంబ సభ్యులు నిరాకరించారు. దీంతో బాలిక మస్తాపానికి గురై ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఎస్‌ఐ అమీర్ ఆలీ కేసు నమోదు చేశారు. డిఎస్‌పి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తికి జైలుశిక్ష

పాతపట్నం : 2020లో ఒక వ్యక్తిని కులం పేరుతో దూసించి రాయితో కొట్టి గాయపర్చిన కేసులో వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.పది వేలు జరిమానా ఎస్‌సి, ఎస్‌టి స్పెషల్ కోర్టు జడ్జి విధించిందని ఎస్‌ఐ బి.లావణ్య సోమవారం తెలిపారు. అప్పటి ఎస్‌ఐ టి.రాజేష్ కేసు నమోదు చేయగా, డిఎస్‌పి సిహెచ్.జి.వి.ప్రసాదరావు దర్యాప్తు చేపట్టారని అన్నారు. డబ్బులు చెల్లించని ఎడలా మరో మూడు నెలలు జైలు శిక్ష విధించారని తెలిపారు.



సన్మానిస్తున్న సభ్యులు

'తెప్పల'కు సన్మానం

పలాస: ఛత్తీఘర్ రాష్ట్రం బిలాయిలో ప్రవాసాంధ్ర ప్రజానాట్య మండలి 44వ వార్షికోత్సవం ఆది, సోమవారాల్లో నిర్వహించారు. ఈ రెండు రోజుల పాటు అఖిల భారత తెలుగు నాటికల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నటుడు, రచయిత, జన జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి పాల్గొన్నారు. ఈ మేరకు కృష్ణమూర్తి దుశ్శాలువ కప్పి సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో బిలాయి ప్రవాసాంధ్ర ప్రజానాట్య మండలి అధ్యక్షులు సిహెచ్.శ్రీనివాస్, ఎపి నాట్య పరిషత్ సమాఖ్య అధ్యక్షులు బుద్దాల వెంకట రామారావు, ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, రుద్రమూర్తి, బాబూరావు పాల్గొన్నారు.

డిగ్రీ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షునిగా చక్రపతి

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక సోమవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షునిగా డాక్టర్ కె.చక్రపతి (పాతపట్నం), కారదర్శిగా ఎస్.రామకృష్ణ (శ్రీకాకుళం), మహిళా కార్యదర్శిగా డాక్టర్ టి.స్వర్ణలత (టెక్కలి), కోశాదికారిగా డాక్టర్ బేపల సతీష్‌కుమార్ (టెక్కలి)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా రాష్ట్ర లీగల్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ ఆర్.ఉమామహేశ్వరరావు, పరిశీలకునిగా పార్వతీపురం జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు వ్యవహరించారు. నూతన జిల్లా కార్యవర్గాన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు కె.సూర్యచంద్రరావు, టి.ఆదిలక్ష్మి, వై.పోలినాయుడు, లూక్‌పాల్ అభినందించారు.

బ్యాంకు ఏర్పాటు చేయాలి

సోంపేట : మండలంలోని కొర్లాంలో స్టేట్ బ్యాంకు సేవలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జాగృతి అధ్యక్షుడు రామ్‌బుడ్డి గణపతి కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. శ్రీకాకుళం రీజనల్ మేనేజర్‌కు ఎమ్మెల్యే సిఫార్స్ లెటర్ ఇచ్చినట్లు తెలిపారు.



పోలీసుల పనితీరును వివరిస్తున్న ఎస్‌ఐ లక్ష్మణరావు

విద్యార్థులకు అవగాహన

లావేరు : మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు యూత్‌క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇండియా లిటరసి ప్రాజెక్టు ఐఎల్‌పి బెంగుళూరు సహకారంతో నిర్వహించబడుతున్న స్కూల్ రెడీన్స్ బాలవికాస్ ప్రాగ్రాంలో భాగంగా 5 నుంచి 10 తరగతులు చదువుతున్న 22 మంది విద్యార్థులకు తహశీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, పిహెచ్‌సి తదితర కేంద్రలకు విజ్ఞాన యాత్రకు తీసుకెళ్లి ఆ శాఖల పరిధిలో పనితీరు, చట్టాలు, సంస్థలు అందించే సేవల పనితీరును డిటి డి.శ్రీనువాసరావు, ఎస్‌ఐ జి.లక్ష్మణరావు, వైద్యాధికారి మౌనిక, వైసిబి మేనేజర్ ఎం.రామారావు, గోగు కిరణలు సిఇఒ శ్రీనువాసరావు వివరించారు. వై.శంకరరావు, రమణమూర్తి, ఐ.రాధ, శాంతి పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి- లావేరు

భోపాల్ గ్యాస్ విషాద బాధితులను స్మరించుకోవడానికి, కాలుష్య ప్రమాదాలు పెంపొందించడానికి డిసెంబర్ 2న జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం నిర్వహిస్తారని ఎపి ఎన్‌జిసి జిల్లా కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు తెలిపారు. బుడుమూరు ఉన్నత పాఠశాలలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. పారిశ్రామిక ప్రమాదాల భయంకరమైన పరిణామాలు పర్యావరణ పరిరక్షణ అత్యవసరతను గుర్తు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. భోపాల్ గ్యాస్ విషాదం, ఇతర కాలుష్య సంబంధిత ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వివిధ రకాల కాలుష్యాలు, మానవ ఆరోగ్యం, పర్యావరణంపై కాలుష్యం కలిగించే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.



అవగాహన కల్పిస్తున్న గోవిందరావు

జాతీయ ఫెన్సింగ్ పోటీల్లో సత్తా చాటాలి



పూజితను అభినందిస్తున్న రాజా

శ్రీకాకుళం అర్బన్ : జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన జిల్లాకు చెందిన క్రీడాకారిణి పూజితను జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా అభినందించారు. విజేతలుగా తిరిగిరావాలని ఆయన ఆకాంక్షించారు. ఇటీవల నంద్యాలలోని డిఎస్‌ఎ స్టేడియంలో నిర్వహించిన 68వ ఎస్‌జిఎఫ్ ఫెన్సింగ్ పోటీల్లో అండర్-19 విభాగంలోని ఇప్పి కేటగిరిలో పూజిత పాల్గొని ప్రతిభ కనబర్చి బ్రాంజ్ మెడల్‌ను కైవసం చేసుకుంది. రణస్థలం మండలం కోటపాలెంకు చెందిన జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న పూజిత రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని నేషనల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఫెన్సింగ్ పోటీలకు ఎంపికకావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ముంపు పొలాలు పరిశీలన

ప్రజాశక్తి- సోంపేట

రెండు రోజులుగా కురిసిన వర్షాలకు నీట మునిగిన వరి పంట పొలాలను మండల ఎఒ బి.నరసింహమూర్తి సోమవారం పరిశీలించారు. మండలంలోని పలాసపురం, బారువ, బేసిరామచంద్రపురం ప్రాంతాల్లో తడిచిన వరి పంటలను పరిశీలించారు. పొలాల్లో నీరు లేకుండా చూసుకోవాలని, చేలు ఆరబెట్టుకోవాలని తెలిపారు. వరిపై ఉప్పు ద్రావణాన్ని చల్లినట్లయితే మొలకలు రాకుండా చేసుకోవచ్చన్నారు.



సోంపేట : పాడైన వరిని పరిశీలిస్తున్న ఎఒ నరసింహమూర్తి

ఇచ్ఛాపురం : మండలంలోని బూర్జపాడులో నీట మునిగి పంట పొలాలను ఎఒ భార్గవి పరిశీలించారు. ఈ మేరకు రైతులకు పలు సూచనలు చేశారు. ఈమె వెంట అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఉన్నారు.



ఇచ్ఛాపురం : రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ భార్గవి

'కృష్ణతేజ' ఫంక్షన్ హాల్ ప్రారంభం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం



ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ అశోక్

లాంటి మారుమూల ప్రాంతంలో నిర్మించిన కృష్ణతేజ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ అద్భుతంగా ఉందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో నూతనంగా నిర్మించిన కృష్ణతేజ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృష్ణమూర్తి కళను ఆయన తనయుడు భానుతేజ పూర్తిచేయడం అభినందనీయమన్నారు. సువిశాలమైన స్థలంలో ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన ఫంక్షన్ హాల్ అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, కమిషనర్ రమేష్, తహశీల్దార్ వెంకటరావు, ఎంపిడిఒ రామారావు, టౌన్ ఎస్‌ఐ చిన్నంనాయుడు, టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు, నందిక జాని, సాలీనా ఢిల్లీ, లీలారాణి, కాళ్ల దిలీప్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి, కోటి, వైసిపి నాయకులు పిలక సంతోష్, పిలక విజయభాస్కర్‌రెడ్డి, రాంజీ, పోతల ఈశ్వరరావు, కృష్ణతేజ కన్వెన్షన్ హాల్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పోలాకి: మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సిఐ జె.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పిర్యాగ్రహారంలోని హైస్కూల్‌లో సంకల్పంలో భాగంగా సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచి ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. చదువుతో పాటు పాటు సమాజంలో నిత్యం జరుగుతున్న పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జి.రంజిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెక్కలి : యువత మాదకద్రవ్యాల బారినపడకుండా ఉండాలని టెక్కలి సిఐ అంబటి విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని నర్సింగపల్లిలో సంకల్పం కార్యక్రమంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యువత సన్మార్గంలో నడవాలన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎస్‌ఐ రాము, పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పోలాకి : మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసరావు

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విస్తృత ప్రచారం

శ్రీకాకుళం అర్బన్ : డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రజల్లో అవగహన కల్పించేందుకు సినీనటుడు అల్లు అర్జున్ ఫ్యాన్స్ ముందుకొచ్చారు. ఆయన నటించిన పుష్ప-2 సినిమా విడుదల సందర్భాన్ని పురష్కరించుకుని ఈనెల 4న నగరంలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చిరంజీవి అభిమాన సంఘం ప్రతినిధి త్వైక్వాండో శ్రీను తెలిపారు. నగరంలోని సరస్వతి థియేటర్ ఆవరణలో ఈ కార్యక్రమానికి చెందిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో న్యూ శ్రీకాకుళం బ్లడ్‌బ్యాంక్ మేనేజర్ టి.మణికంఠ, రాగోలు నాగశివ, అల్లు అర్జున్ అభిమాన సంఘం తరఫున నవీన్ తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

విద్యకు ప్రాధాన్యం

ప్రజాశక్తి- పాతపట్నం

టిడిపి కూటమి ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. నియోజకవర్గంలోని పాతపట్నం, హిరమండలం మండలాల్లోని కెజిబివి పాఠశాలల్లో రూ.143.30 లక్షల అంచనా వ్యయంతో మంజూరైన లైబ్రరీ, కంప్యూటర్ భవనాల నిర్మాణాలకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌కు ప్రభుత్వం మరింత భరోసా ఇస్తుందన్నారు. విద్యార్థులను నాణ్యమైన విద్యను అందించి ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు. నేటి విద్యార్థులే రేపటి భారత దేశ పౌరులని, వారికి ఉన్నత విద్యా విలువలు నేర్పే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపిలు దొర సావిత్రమ్మ, టి.తిరుపతిరావు, టిడిపి మండల అధ్యక్షుడు పైల బాబ్జి, బుద్దల నరేష్, సింహాచలం, మల్లేశ్వరరావు, అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎఒ శ్రీనివాసరావు

వ్యవసాయ సహాయకులకు శిక్షణ

బూర్జ : మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకులకు రబీ పంటల బీమా పథకంపై అవగాహన కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఎఒ ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో రబీ సీజన్‌లో సాగు చేసే మినుము, పెసర, వేరుశెనగ, రాగి, మొక్కజొన్న, వరి పంటలకు భీమా వర్తిస్తుందని, దిగుబడులు ఆధారంగా నిర్ణయించబడుతుందన్నారు. పంట రుణాలు తీసుకునే రైతులు బ్యాంక్‌లో, లేనివాళ్ల మీసేవా కేంద్రాల్లో రైతు వాటా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి దీప్తి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

నేడు కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు

సోంపేట : సోంపేట సామాజిక ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి ఎ.రాము ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన ఈ వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృత్తివిద్య కోర్సులతో ఉపాధి అవకాశాలు

పొందూరు: వృత్తివిద్యా కోర్సులతో అపారమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య అన్నారు. మండలం లోలుగు కెజిబివిలో తొమ్మిదో తరగతి విద్యార్థినులకు 'బ్యూటీ అండ్ వెల్‌నెస్' సబ్జెక్టుపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్ర పర్యటనలో భాగంగా శ్రీకాకుళంలోని ఓ బ్యూటీ పార్లర్‌లో విద్యార్థినులకు శిక్షణ అందించారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ బి.మనెమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.



క్షేత్ర పర్యటనకు వెళ్తున్న విద్యార్థినులు

'గోకార్టింగ్' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యాన వచ్చే ఏడాది మార్చి 4,5,6,7 తేదీల్లో జాతీయ స్థాయి గోకార్టింగ్ ఛాంపియన్ షిప్ సీజన్-2 పోటీ నిర్వహిస్తున్నామని డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం కళాశాల ఆవరణలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోకార్టింగ్ ఛాంపియన్ షిప్ గురించి వివరిస్తూ కంబుషన్, ఎలక్ట్రిక్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. రూ.4 లక్షల విలువైన బహుమతులను ప్రతిభ కనపరచిన విద్యార్థులకు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఇంజినీరింగ్ విద్యార్థులు సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను వెలికి తీయాలని ఆకాంక్షించారు. ఈ ఛాంపియన్ షిప్ కో-ఆర్డినేటర్ ఐతమ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, కో-కన్వీనర్లుగా డీన్ ఆరెడ్డి డాక్టర్ డి.శ్రీరాములు, హెచ్‌డిలు డాక్టర్ వి.అశోక్‌కుమార్, డాక్టర్ వై.రమేష్, ప్రొగ్రామ్ కో-ఆర్డినేటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.రఘువీర్‌లు వ్యవహరిస్తున్నట్టు వివరించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

'ఉపాధి' పనులు వేగవంతం



మాట్లాడుతున్న ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ పనులు వేగవంతం చేయాలని ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో రూ.5.26 కోట్ల నిధులతో 85 సిమెంట్ పనులు ఎంతవరకు వచ్చాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు. యుద్ధప్రాతిపదికగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఉపాధి హామీ నిధులు ఎంతో దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. నిబంధనల ప్రాప్తికి పనులు చేపడుతూ నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో మండల పిఆర్ ఇంజినీర్ ఆనందరావు, ఎపిఒ టి.రవి పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

సైనిక పతాక విరాళాల సేకరణ

పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుల కుటుంబాల సహాయార్థం సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని నిర్వహించుకోవాల్సిన అవసరముందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సోమవారం సాయుధ దళాల పతాకావిష్కరణ కోసం విరాళాలు సేకరణలో భాగంగా రూపొందించిన పోస్టర్‌ను జెసి ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి శైలజ, అధికారులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

అక్షర వెలుగు పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా వయోజన విద్య ఆధ్వర్యాన ముద్రించిన అక్షర వెలుగు పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆవిష్కరించారు. జెడ్‌పిలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అక్షరాస్యత శాతాన్ని పెంచాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. నేటి సాంకేతిక యుగంలో చదువు రాని వారు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వేరొకరిపై ఆధారపడి జీవనం సాగించాల్సి వస్తోందన్నారు. కొన్నిసార్లు చదవు లేక పోవడం వల్ల మోసాలకు గురై నష్ట పోతున్నారన్నారు. అందువల్ల ప్రతిఒక్కరు చదువు కోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్, డిఇఒ తిరుమల చైతన్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న నేహా

నేహాకు నాట్యతోరణం అవార్డు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరానికి చెందిన డి.నేహాకు కూచిపూడిలో చేసిన సృజనాత్మక కళార్చనకు నాట్య తోరణం 2024 సిపి రావు మెమోరియల్ అవార్డు అందించారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో నవంబరు 30న నాట్య తోరణం కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు అమృత కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఈ అవార్డును ప్రకటించారు. దీంతో పాటు ప్రతిష్టాత్మక డాక్టర్ సిపి రావు మెమోరియల్ అవార్డులను బహూకరించారు. నేహా జ్ఞాపిక, ధ్రువపత్రం, రూ.25 వేలు నగదు అందజేశారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సన్యాసిరావు

ప్రజా పోరాటాలతోనే బలమైన ప్రతిపక్షం

ప్రజాశక్తి- పలాస

ప్రజా పోరాటాలతోనే బలమైన ప్రతిపక్షాన్ని నిలుపుగలమని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తామాడ సన్యాసిరావు అన్నారు. ఈ నెల 4న విజయవాడలో నిర్వహించనున్న ప్రజాహక్కుల సభ, ర్యాలీ పోస్టర్‌ను మండలంలోని బొడ్డపాడు అమరవీరుల స్మారక భవనంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ ప్రజాహక్కుల సభకు ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, యువకులు, మహిళలు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా లీడింగ్ కమిటీ సభ్యులు మద్దిల రామారావు, వంకల అప్పయ్య, కుత్తుం దుష్యంత్, పోతనపల్లి కామేశ్వరరావు, పోతన పల్లి అప్పారావు, గేదెల జగదీష్, ఎన్.యుగంధర్, దున్న శ్రీను, మద్ది జగదీష్, రాజారావు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

'ఎండల మల్లన్న' హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని రావివలస ఎండల మల్లికార్జున స్వామి ఆలయం హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. కార్తీక మాసంలో రూ.30,30,042 ఆదాయం వచ్చినట్లు ఆలయం కార్యనిర్వహణాధికారి జి.గురునాధరావు తెలిపారు. గతం కంటే రూ.2,38,840 తగ్గిందన్నారు. కార్తీక సోమవారాలు విజయవంతం చేసిన ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తికి, పోలీసులు, రెవెన్యూ, విద్యుత్‌శాఖ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

రోగులకు ఉచిత భోజనం

కోటబొమ్మాళి: ఒకనుంచి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఉచిత భోజన సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తుందని పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఉచిత భోజన పథకాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పొన్నాడ గణేష్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం రోగులకు భోజనం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, అన్న క్యాంటీన్ల ద్వారానే కాకుండా సామాజిక ఆస్పత్రుల ద్వారా రోగులకు ఉచిత భోజనం అందిస్తుందన్నారు. కాంట్రాక్టర్ ఎ.శ్రీనివాసరావు రుచికరమైన తయారు చేసి నాణ్యతతో కూడిన భోజనం రోగులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ


రోగులకు భోజనం అందజేస్తున్న టిడిపి నాయకులు

అధ్యక్షుడు బోయిన రమేష్, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, దేవాది సింహాద్రమ్మ, మక్క లక్ష్మణరావు, కోరాడ గోవిందరావు, ముత్తురాజు పాల్గొన్నారు.


శస్త్రచికిత్సలకు ఎంపికైన రోగులతో వైద్యాధికారులు

నేత్రాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- పాతపట్నం

నేత్రాలపై అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ డాక్టర్ ఎ.కావ్యరాణి అన్నారు. జిల్లా అంధత్వ నిర్మూలన సంస్థ సౌజన్యంతో మండలంలోని ఎ.ఎస్.కవిటి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నక్క మార్కండరావు ఆధ్వర్యాన సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు 50 మంది నేత్రాలను పరీక్షించి, అందులో 20 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. బైదిలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సదాశివం శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో క్యాంప్ ఇన్‌ఛార్జి టి.రామారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాపారావు మృతి ఉద్యమాలకు లోటు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ప్రగతిశీల కార్మిక సంఘం సభ్యులు కోళ్ల పాపారావు (60) అనారోగ్యంతో ఆదివారం రాత్రి టెక్కలిలో మృతి చెందారు. గతంలో పీపుల్స్ పార్టీలో పనిచేశారు. ఆరోగ్యం కారనంగా జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, కాకరాపల్లి, సోంపేట థర్మల్ పోరాటంలో పాల్గొన్నారు. నౌపడ రైల్వే ఉద్యమంలో పాల్గొన్నారు. ఇటీవల ఉప్పు కార్మికుల సమస్యల కోసం ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం కడదాకా ఉండలేక పోయానని ఎప్పుడూ బాధపడేవారు. పాపారావు మృతి ఉద్యమాలకు, కార్మికులకు లోటని వివిధ ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. అతని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మృతి చెందినా జీవించాలనే తపనతో తన శరీరాన్ని సంప్రదాయం పేరుతో కర్మకాండలు, కృతువులు నిర్వహించకుండా వైద్య విద్యార్థుల పరిశోధన, ఉపయోగార్థం 2023లో అంతర్జాతీయ శరీర అవయవ దినోత్సవం సందర్భంగా తన శరీరాన్ని దానం చేశారు.

రిమ్స్‌కు మృతదేహం అందజేత

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని టెక్కలికి చెందిన ప్రగతిశీల


ఆస్పత్రికి మృతదేహాన్ని అందజేస్తున్న కుటుంబసభ్యులు

కార్మిక సంఘం నాయకుడు కోళ్ల పాపారావు మృతదేహాన్ని రిమ్స్ వైద్య కళాశాలకు కుటుంబ సభ్యులు సోమవారం అప్పగించారు. మృతుడు పాపారావు గతంలో పీపుల్ వార్ ఉద్యమంలో జిల్లా నాయకునిగా పనిచేసి అనారోగ్య కారణాలతో జనజీవన స్రవంతిలో కలిశాడు. ఆయన అభీష్టం మేరకు మృతదేహాన్ని రిమ్స్‌కు అందజేశారు. కార్యక్రమంలో రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటాచలం, అనాటమీ ప్రొఫెసర్ డాక్టర్ రాం ప్రసాద్, అసోసియేషన్ ప్రొఫెసర్ డాక్టర్ హేమారాధిక, ప్రజా సంఘాల నాయకులు మిస్కా కృష్ణయ్య, రొక్కం లోకనాథం, కుటుంబ సభ్యులు కోళ్ల లోకేష్‌బాబు, కోళ్ల కుమారస్వామి, తియ్యల ఈశ్వరరావు పాల్గొన్నారు.


నిత్యావసర సరుకులు అందజేస్తున్న సాయికుమార్

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆపదలో ఉన్న వారికి ఆదుకోవడం ప్రతిఒక్కరి కర్తవ్యమని, అందులో ఉండే ఆత్మ సంతృప్తి ఎక్కడా దొరకదని పెద్దపాడుకు చెందిన బొట్టా సాయికుమార్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఎన్‌టిఆర్ ఎంహెచ్ స్కూల్‌లో పూర్వ విద్యార్థి గొంటి తాతారావు మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరకులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వపు విద్యార్థులు కొల్లి శివకుమార్, అరజంగి తిరుమలరావు, కరణం షణ్ముఖ, ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ ప్రతినిధి నంది ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన

ప్రజాశక్తి- టెక్కలి

సమాజంలో సాంప్రదాయం పేరుతో జరుగుతున్న బాల్యవివాహాలను నిరోధించాలని, ఇందుకు విద్యార్థుల్లో అవగాహన అవసరమని టెక్కలి ఐసిడిఎస్ పిఒ ఎన్.శోభారాణి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాలు వల్ల భవిష్యత్ జీవితం దుర్భరంగా మారుతుందన్నారు. మానసిక కుంగుబాటు వంటి లక్షణాలు ఉంటాయన్నారు. పిల్లల్లో మానసిక స్థితి బాగోదని అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ మాట్లాడుతూ విద్యార్థి దశ కీలకమని, ఈ సమయంలోనే అవగాహన పెంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు ఆయాలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఉపాధిహామీ సిబ్బంది

ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాశక్తి- పాతపట్నం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు ఎన్‌ఆర్‌ఇజిఎస్ సిబ్బంది సోమవారం దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. శ్రామికుడిగా ప్రయాణాన్ని మొదలుపెట్టి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగారని పలువురు ఉపాధిహామీ సిబ్బంది ఎమ్మెల్యేను కొనియాడారు. అలాగే ఉపాధి హామీ పథకంలో అనేక సమస్యలతో సతమతమవుతూ విధులు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికి ఫీల్డ్ అసిస్టెంట్లు సమస్యలను తీసుకువెళ్లి న్యాయం చేయాలని పలువురు ఫీల్డు అసిస్టెంట్లు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకులు పడుతున్న ఇబ్బందులను సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తానన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ చంద్రకుమారి, ఎడి లింగాల మధుబాబు, సురేష్, సర్పంచ్‌లు, ఫీల్డు అసిస్టెంట్లు, మేట్లుతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందనలు

ప్రజాశక్తి- పాతపట్నం

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల విద్యార్థులు ఆట్య, పాట్య ఫెడరేషన్ ఆధ్వర్యాన కాకినాడలో నవంబరు 30, డిసెంబరు 1న రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. అందులో స్థానిక అంబేద్కర్ గురుకుల విద్యార్థులు పాల్గొని విజేతలుగా నిలిచారు. ఎపి కర్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన 5వ ఫ్లోర్ కర్లింగ్ రాష్ట్ర ఛాంపియన్ షిప్ జూనియర్ విభాగంలో ఐదుగురు విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించారు. సబ్ జూనియర్ భాగంలో నలుగురు విద్యార్థులు బ్రాంజ్ మెడల్



విద్యార్థినులను అభినందిస్తున్న అధ్యాపకులు

వచ్చినట్లు ప్రిన్సిపాల్ వి.అర్చన సోమవారం తెలిపారు. విద్యార్థినులను పీడీ ఎన్.దుర్గమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- కవిటి

పెరుగుతున్న నేరాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఇచ్ఛాపురం సిఐ చిన్నంనాయుడు తెలిపారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా కవిటి మండలం కొజ్జిరియాలో సోమవారం రాత్రి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, చైన్ స్నాచింగ్ కేసులు, సైబర్ క్రైమ్, డ్రగ్స్, మహిళలపై నేరాలకు సంబంధించి స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కవిటి ఎస్ఐ రవివర్మ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ చిన్నంనాయుడు

పకడ్బందీగా సామాజిక తనిఖీ

ప్రజాశక్తి- పోలాకి

మండలంలో ఉపాధి హామీ ద్వారా చేపట్టిన పనులపై నిర్వహించనున్న సామాజిక తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలని ఎపిడి లోకేష్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023-24 సంవత్సరం ఉపాధి హామీ ద్వారా నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీలు సామరస్యంగా ఉండదాలన్నారు. ప్రతి పని వివరాలు, కేటాయించిన నిధులు, చేసే ఖర్చు, కూలీలకు కల్పించే పని రోజులు, చెల్లించిన కూలి తదితర అంశాలపై క్షుణ్ణంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, ఎంపిడిఒ జి.రవికుమార్, జిల్లా విజిలెన్స్


మాట్లాడుతున్న ఎపిడి లోకేష్

అధికారి స్వరూపరాణి, ఎపిఒ రమణారావు, ఎస్‌ఆర్‌పి పున్నంనాయుడు, డిఆర్‌పిలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- రణస్థలం

విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన గవిడి కౌశిక్‌తో పాటు మరో ముగ్గురు మృతి చెందడంతో సోమవారం శ్రీకాకుళం వారి స్వగృహంలో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆ కుటుంబాలను పరామర్శించారు. కౌశిక్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులైన నగరానికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్తలు లంక గాంధీ, గవిడి వాసుల కుటుంబాలను పరామర్శించారు. ఈయనతో పాటు వైస్ ఎంపిపి ప్రతినిధి మైలపల్లి కామరాజు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు రెడ్డి విశ్వేశ్వరరావు, సర్పంచ్ ప్రతినిధి గొర్లె అప్పలనాయుడు, సర్పంచ్ గొర్లె అప్పల నర్సునాయుడు, కురిటి రామకోటి, లంక బాబాజీ నాయుడు, కిల్లారి వెంకట నాయుడు, గొర్లె శ్రీనివాసరావు, గొర్లె రవి, కెల్ల రమణ, మంత్రి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి- ఆమదాలవలస:

పురపాలక సంఘం పరిధిలోని 20వ వార్డు వెంగళరావు కాలనీలో బుడుమూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 300 మందికి పోలాల అమావాస్య సందర్భంగా వృద్ధులు, వికలాంగులు, పేదలకు దుప్పట్లు, రగ్గులను ఉచితంగా పంపిణీ చేసి అన్న వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పాతిన గిరిబాబు, బొడ్డేపల్లి రవికుమార్, బొడ్డేపల్లి సూర్యారావు, ఉపాధ్యాయులు నూక అప్పలనాయుడు, గొండు శ్రీనివాస్, కోటిపాత్రుని కైలాష్, దుప్పల వాసుదేవరావు పాల్గొన్నారు.


ఆమదాలవలస : దుప్పట్లు అందజేస్తున్న శ్రీనివాసరావు


పొందూరు : అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న యాత్రికులు

రాపాకలో అన్నదానం

పొందూరు: మండలం రాపాకలో రామాలయం వీధిలో శివస్వాముల మాలవిరమణ సందర్భంగా సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది యాత్రికులు పాల్గొన్నారు. అలాగే నిరుపేదలకు వస్త్రాలను అందించారు. అనంతరం ఆకుపూజలో భాగంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి కొంచాడ మోహనరావు, శివస్వాములు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వనభోజనం ఐక్యతకు సోపానం

ప్రజాశక్తి- లావేరు

కార్తీక వనభోజనం ఐక్యతకు సోపానమని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. మండలంలోని బొంతుపేటలో సోమవారం గ్రామస్తులు నిర్వహించిన కార్తీక వనభోజన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులంతా ఒకే దగ్గర వనభోజనం కార్యక్రమం నిర్వహించడం ఆనంద దాయకమన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముప్పుడి సురేష్, జనసేన ఎచ్చెర్ల ఇన్‌ఛార్జి విశ్వక్షేన్ మాజీ జెడ్‌పిటిసి పి.మధుబాబు, నాయకులు పిన్నింటి బానోజీరావు, గోవిందనాయుడు, బొంతు వెంకటరమణ, జగదీష్, బంగారు నాయుడు, కెళ్ల రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదు చేపడుతున్న టిడిపి నాయకులు

జోరుగా టిడిపి సభ్యత్వాలు

ప్రజాశక్తి- పొందూరు

మండలం రాపాకలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పాత సభ్యత్వాలు రెన్యువల్‌తో పాటు కొత్తవారికి సభ్యత్వం అందించారు. కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా కార్యదర్శి బలగ శంకర భాస్కరరావు, మండల తెలుగుయువత అధ్యక్షుడు కండాపు శ్రీనివాసరావు, కొంచాడ కృష్ణ, వెంకటేష్, మాదవ్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు రూ.10 వేలు వితరణ

కోటబొమ్మాళి: కోటబొమ్మాళిలోని టిడిపి కార్యాలయం అవరణలో పేదల కోసం ఏర్పటు చేసిన అన్న క్యాంటీన్‌కు టెక్కలి మండలం తిర్లంగికి చెందిన గండేటి గౌతమి, ప్రసాద్‌లు సోమవారం రూ.10 వేలును వితరణగా అందజేశారు. తన కుమార్తె రాగ సంహిత పుట్టిరోజు సందర్భంగా పేదలకు రూ.5లకే భోజనం అందించే నేపథ్యంలో నగదును అందజేశామన్నారు. ఈ మొత్తాన్ని అన్నా క్యాంటీన్ నిర్వాహకులు లాడి శ్రీనివాస్‌కు అందజేశారు.